క్లుప్తంగా

'ఆర్థికసాయం అందించండి'



వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిన మర్సుకోల కృష్ణకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని గోండ్వాన్ ఫౌండేషన్, కొలాం సంఘం జిల్లా నాయకులు ఆత్రం రాజ్‌కుమార్, మడావి మాన్కులు కోరారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిప్రతం అందజేశారు. ట్రిపుల్ ఐటీ రాయచూర్, కర్ణాటకలో సీటు పొందిన కృష్ణకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున ఆర్థికసాయం చేయాలని కోరారు.

కళాశాల తనిఖీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను గురువారం డీఐఈవో కల్యాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని, సకాలంలో సబ్జెక్టులు పూర్తి చేసి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు పూర్తి చేయాలని సూచించారు. కళాశాలకు వచ్చిన డీఐఈవో కల్యాణిని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భూపల్లి తిరుపతి, రమేశ్, ఆసిఫ్, ఘన్‌శ్యాం పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

జైనూర్: మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని షీటీం ఇన్‌చార్జి వెంకటేశ్వర రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది స్వప్న, సునీత, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

తిర్యాణి: జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలను ఈనెల 31న మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలుర)లో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 17, అండర్ 14 విభాగంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో రావాలని సూచించారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని వంజీరి గ్రామానికి వెళ్లే దారిలో గల ఓ ప్లాట్‌లో ఇటీవల అక్రమంగా నిర్మించిన దుకాణాన్ని వెంటనే తొలగించాలని మాజీ ఎక్స్ సర్వీస్‌మెన్, హ్యుమన్ రైట్ ప్రొటెక్షన్ సభ్యులు శివకుమార్ డిమాండ్ చేశారు. ప్లాట్ యాజమానిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, గ్రామ పంచాయతీ నుంచి పలుమార్లు నోటీసులు జారీ చేసినా.. తొలగించడం లేదన్నారు. దుకాణంలో బెల్ట్‌షాపు కూడా నిర్వహిస్తున్న పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

రైతులు వివరాలు అందించాలి



వివరాలు సేకరిస్తున్న ఏఈవో ఘన్‌శ్యామ్

కౌటాల: రుణమాఫీ కాని అర్హులైన రైతులు వివరాలు అందించాలని మండల నోడల్ అధికారి, కౌటాల ఏఈవో ఘన్‌శ్యామ్ అన్నారు. గురువారం మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. రూ. 2లక్షల లోపు రుణమాఫీ కాని రైతులు నోడల్ అధికారి వివరాలు సమర్పిస్తే రైతు భరోసా యాప్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. కౌటాల రైతువేదికలో అధికారులు అందుబాటులో ఉన్నారని, అర్హులైన రైతులు సంప్రదించాలని కోరారు.

రేపు శనిమందిర్‌లో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని పోచమ్మబస్తీలోని శనీశ్వర ఆలయంలో శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ పండితులు నందకిశోర్ జోషి తెలిపారు. ఈసందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

జాడలేని 'యంత్రలక్ష్మి'

- సబ్సిడీపై అందని వ్యవసాయ పరికరాలు
- ఆర్థికంగా చితికిపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం



రింగన్‌ఘాట్‌లో సాగు చేస్తున్న పత్తి

కెరమెరి: రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ సబ్సిడీ పథకాలకు ప్రభుత్వం మంగళం పాడింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నేళ్లుగా.. రైతులకు యంత్రాలు అందించాలని రైతులు వేడుకుంటున్నా.. ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదు. సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేయడం ఎత్తేసింది. వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా.. యంత్ర పరికరాలు పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించ లేదు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీల్లో 6731 మంది రైతులు ఉండగా.. 29 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అందులో ఈఏడాది 24 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు.

పెరిగిన ధరలతో నిరాశ..

అన్నదాతలకు వ్యవసాయం పెను భారంగా మారింది. అమాంతంగా పెరిగిన ధరలతో నిరాశ చెందుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం ప్రయత్నాయ పంటలు వేయాలని రైతులకు సూచిస్తుంది తప్పా.. సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందించడం లేదు. గత ప్రభుత్వం పెట్టుబడి సాయం రైతుబంధు ఇచ్చినా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతుబంధు ఇంకా ఇవ్వలేదు. దీంతో రైతులు వ్యవసాయంపై నిరాసక్తి కనబరుస్తున్నారు. యంత్రలక్ష్మికి నిధుల్లేక గత ప్రభుత్వం యంత్రాల పంపిణీని నిలిపివేసింది.

ఊసేలేదు..

గత ప్రభుత్వం ఎంతో కొంత రైతులకు ఆసరాగా నిలిచినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రుణమాఫీతోనే సరిపెట్టింది. ఆ రుణమాఫీ కూడా మండలంలోని ఇంకా కొంత మంది రైతులకు రావాల్సి ఉంది. రుణమాఫీని అడ్డుపెట్టుకుని ఇతరత్ర సౌకర్యాలకు కోత పెట్టింది. ఇప్పటి వరకు రైతులకు ఆసరాగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందళన చెందుతున్నారు. కాగా గత ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకానికి నిధులు లేక 2018 నుంచి ఈ పథకాన్ని నిలిపి వేసింది. దీంతో బహిరంగా మార్కెట్లో యంత్రాలు కొనలేక రైతులు చితికిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై యంత్రపరికరాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పరికరాలు అందించాలి



వ్యయసాయ యంత్రాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం, గతంలో వ్యవసాయా శాఖ నుంచి వివిధ రకాల పరికరాలు అందేవి. ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బంది తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడిచినా.. ఇంకా రైతుల కోసం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు – ఎల్లయ్య, రైతు, బాబేఝరి

విజృంభిస్తున్న జ్వరాలు

- ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్న బాధితులు
- జ్వరం తగ్గినా నొప్పులు తగ్గడం లేదు



కర్జి గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న మహిళ

దహెగాం: వాతావరణంలో మార్పుల కారణంగా.. అలాగే ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గత వారం పది రోజుల నుంచి ఇంటిఒకరూ జ్వరపీడితులు ఉన్నారు. ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వైద్యం చేయించుకుంటున్నారు.

ఎక్కడ చూసినా జ్వర పీడితులే..

మండల కేంద్రంతో పాటు చౌక, ఒడ్డుగూడ, కర్జి, రాంపూర్, మొట్లగూడ గ్రామాల్లో గత వారం రోజుల నుంచి జ్వరాల బారినపడి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో దోమలు పెరిగాయని దీంతో జ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేసినా.. ఎలాంటి ఫలితం లేదని వాపోతున్నారు. కొంత మందికి జ్వరం తగ్గిన ఒళ్లు నొప్పులు మాత్రం తగ్గడం లేదంటున్నారు. దీంతో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. జ్వరాల కారణంగా వ్యవసాయ పనులకు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు గురువారం సందర్శించారు. జ్వరాలతో ఆస్పత్రికి వచ్చిన వారితో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుక్కకాటు, పాముకాటు తదితర వంటి మందులు అందుబాటులో ఉన్నాయా? లేదా? అని వైద్యులను అడిగారు. అనంతరం డెలివరీ రిజిస్టర్‌ను పరిశీలించారు. చాలా తక్కువ డెలివరీ అవడంతో డాక్టర్ అవినాష్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. జిల్లా వైద్యాధికారి తుకారాంతో ఫోన్‌లో మాట్లాడి బెజ్జూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీలపై శ్రద్ధ చూపడం లేదని, గతం కంటే చాలా తక్కువ డెలివరీలు అవుతున్నాయని, వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, చప్పిడి సత్యనారాయణ, కుమ్మరి తిరుపతి, ఉమ్మెర బాలకృష్ణ, జాడి దిగంబర్, జునగరి మధుకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబాలను సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు గురువారం పరామర్శించారు. మండల కేంద్రంతో పాటు పాపన్నపేట గ్రామానికి చెందిన మల్లక్క గత రెండు రోజుల క్రితం మృతి చెందడంతో వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులకు పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన కావుడే ఆత్మారావు భార్య నానాబాయి రెండు రోజుల క్రితం మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని సైతం పరామర్శించారు.

ఘనంగా కొట్నాక భీంరావ్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

బెజ్జూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన శాఖ మంత్రిగా పని చేసిన ఆదిలాబాద్ జిల్లా, ప్రస్తుత కుమురం భీం జిల్లా నివాసి గోండ్‌రాజ్ కోట్నాక్ భీంరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కొట్నాక భీంరావ్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెజ్జూర్ మండల రాయిసెంటర్ సర్‌మేడి కొడప శంకర్, ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎంపీటీసీ ఆత్రం సాయి, ఆత్రం బక్కయ్య, పోల్క వెంకటేశ్, తొర్రెమ్ వినోద్, సడమేక రమేశ్, కోరెతా నితిన్, శ్రీరామ్, హరిప్రసాద్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

బీమా సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న అధికారులు

కౌటాల: ప్రతిఒక్కరూ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ ఆర్‌ఎం మురళి మోహన్ అన్నారు. గురువారం కౌటాల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో లబ్ధిదారులకు రూ. 20 లక్షల చెక్కు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి బీమా, సురక్ష యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయనగరం గ్రామానికి చెందిన బాలస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి చెక్కు అందించినట్లు పేర్కొన్నారు. మేనేజర్ రమేశ్, ఏపీఎం ముక్తేశ్వర్, బ్యాంకు సిబ్బంది శ్రీనివాస్, ప్రదీప్, సురేశ్, గోపి పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినం విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జాక్ నాయకులు

కెరమెరి: సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేద్దామని ఉపాధ్యాయ సంఘాల మండల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 1న జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాక్ నాయకులు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, టేకం భాస్కర్, విద్యాసాగర్, రవి. సమ్మయ్య, ధన్‌లాల్, సంతోష్, మోయినోద్దిన్, విఠోబా, దేవ్యాని, మౌనిక, దివ్య పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు గురువారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు పంట పెట్టుబడి కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గొడిసెల కార్తీక్, రాజేందర్, మాలశ్రీ, టీకానంద్ పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



బ్యాటింగ్ చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: క్రీడలు ప్రజల జీవితంలో భాగం కావాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. భారత హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర దీపక్ తివారి, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ తదితరులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం, మానసికోల్లాసం కోసం ప్రతిఒక్కరూ క్రీడలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రికెట్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఎలెవన్ టీం, ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ ఎలెవన్ టీం, డీఎఫ్‌వో ఆధ్వర్యంలో టీచర్స్ ఎలెవన్ టీమ్, పాత్రికేయల మీడియా టీం పాల్గొన్నాయి. పోలీస్ టీం విజేతగా నిలవగా, టీచర్స్ టీం రెండో స్థానంలో నిలిచింది.

అటవీభూమిలో కందకాలు



కందకం తవ్విస్తున్న అటవీశాఖ అధికారి

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ చిత్తకర్ర రిజర్వు ఫారెస్ట్‌లో 41 కంపార్ట్‌మెంట్‌లో గురువారం అటవీశాఖ అధికారులు కందకాలు తవ్వారు. సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ కందకాలను తవ్వినట్లు ఎఫ్‌ఆర్‌వో మజారోద్దిన్ తెలిపారు. కాగా ఇదే ప్రాంతంలో ఆంజనేయ ఆలయం నిర్మాణంలో ఉంది. గతంలో ఇదే ప్రాంతానికి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చినట్లు సమాచారం. ఇటు అటవీశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు మాదంటే మాదని వాగ్వాదానికి దిగిన సందర్భాలు ఉన్నాయి. దీంతో 2017 మార్చిలో హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల కొందరిపై చార్జీషీట్ దాఖలు చేసినట్లు ఇక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈనెల 31న ఆంజనేయ ఆలయం ప్రారంభం నేపథ్యంలో మళ్లీ వివాదం నెలకొంది.

'పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు'



మాట్లాడుతున్న అబ్దుల్ ఖమర్

బెజ్జూర్: పెన్షన్ భిక్ష కాదని ఉద్యోగి హక్కు అని జేఏసీ కమిటీ నాయకులు అబ్దుల్ ఖమర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీపీఎస్‌ను అంతం చేసి ఓపీఎస్ సాధించుకునే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. సమావేశంలో బెజ్జూర్ ఎంపీడీవో గౌరీ శంకర్, పంచాయతీ కార్యదర్శి మినాజ్, ధర్మయ్య, ఉపాధ్యాయులు సంతోష్, జర్పుల శ్యామ్, కవిత, శ్రీలత, తిరుపతి, ముకుంద్, విజయ్, రఘునాథ్, విష్ణు, బాబా తాజుద్దీన్, జుమిడి వసంత్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై మధుకర్ అన్నారు. గురువారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ఆధునిక కాలంలో సోషల్ మీడియా వినియోగం పెరిగిందని, సైబర్ నేరాల బారిన యువత పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకిషన్, రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

మందకృష్ణను సన్మానించిన 'రేగుంట'

ఆసిఫాబాద్: ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవరావు గురువారం ఆ సంఘం అధినేత మందకృష్ణ మాదిగ, జ్యోతి దంపతులను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. 30 ఏళ్ల ఉద్యమ పోరాటాలతో కూడిన రేగుంట కేశవరావు రాసి పాడిన పాటల సీడీని మందకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సమస్యలపై చర్చించినట్లు కేశవరావు తెలిపారు.

పార్టీ సభ్యత్వం చేయించిన నాయకులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సిర్పూర్(టి): మండల బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని గురువారం మండల బీజేపీ నాయకులు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్ములే శంకర్, నీరటి సత్యనారాయణ, వడ్డేటి నాని, నేరెళ్ల అశోక్, నులిగొండ మహేశ్, పైడి విలాస్, రాచర్ల మహేశ్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కృషి చేస్తామని కాగజ్‌నగర్ ఎస్పీఎం మేనేజర్లు రీనా బిల్వాల్‌నీ, ప్రవీణ్ శుక్లా అన్నారు. గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాలను పేపర్ మిల్లు ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలకు కంప్యూటర్ విద్య అందించేందుకు, ఫిల్టర్ వాటర్ ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. అంతకు ముందు తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణసింగ్, ఉపాధ్యాయులు రమేశ్, రైయిస్ అహ్మద్, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

1న పెన్షన్ విద్రోహ దినం

ఆసిఫాబాద్‌అర్బన్: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఉద్యోగులు, అధ్యాపకులు, కార్మికులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల బాలుర పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, నాణ్యమైన కూరగాయాలు పెట్టాలన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తిరోజ, విద్యార్థులు పాల్గొన్నారు.